ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5**
ఆదివారం 1 జూన్ 2025



సాగు భారం..

- యేటా పెరుగుతున్న ఖర్చులు
- ప్రస్తుత సీజన్‌లో పెరిగిన ఎరువుల ధరలు
- ట్రాక్టర్, నాగళ్ల అద్దె పెంపు
- ఆందోళనలో అన్నదాతలు



జగిత్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ప్రతి యేటా పెట్టుబడి భారంగా మారుతోంది. ప్రస్తుత సీజన్‌లో ఎరువుల ధరలు అమాంతం పెరిగి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. డీఏపీ, పొటాష్ తదితర ఎరువుల ధరలు పెరిగాయి. దీనికి తోడు ట్రాక్టర్లు, యంత్రాల అద్దెలు, వ్యవసాయ కూలీల కూలి అదనపు భారంగా తయా రైంది. గత యేడాది కంటే ఈసారి ఎకరాకు రూ.5 వేల వరకు అదనపు భారం పడనుందని రైతులు వాపోతు న్నారు. జిల్లాలో అత్యధికంగా రైతులు కాలువలు, చెరువులు, కుంటలు, బోరు బావులు, వర్షాలపై ఆధారపడి వరి సాగు చేస్తుంటారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాల్లో అత్యధికంగా వరి సాగు చేస్తుండగా, మిగిలిన ప్రాంతాల్లో మొక్కజొన్న, పత్తి, చెరుకు, పసుపు, కంది, పెసర తదితర పంటలపై రైతులు దృష్టి సారించారు.

జిల్లాలో వానాకాలం సాగు అంచనా..

జిల్లావ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకాలంలో పంటల సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3,35,978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,14,419 ఎకరాలు సాగు చేస్తారని అంచనా. ఇది సాధారణం కన్నా 78, 441 ఎకరాలు అధికంగా ఉంది. ఇందులో ప్రధా నంగా వరి 3,10,642 ఎకరాలు, మొక్కజొన్న 32,000 ఎకరాలు, కందులు 1,500, పెసర్లు 100, సోయా చిక్కుడు 500, పత్తి 18,000, చెరుకు 500 ఎకరాలు, పసుపు 8,500, మిరప 500 ఎకరాలు, పలు కూరగాయల పంటలు 400 ఎకరాలు, ఆయిల్ పాం 3,000 ఎకరాలు, మామిడి 38, 277 ఎకరాలు, ఇతర పంటలు 500 ఎకరాల్లో సాగు కానున్నట్లు అధికారులు అంచనా వేశారు. 2023 వానాకాలం సీజన్‌లో జిల్లాలో 4,17, 378 ఎకరాల్లో, 2024 వానాకాలం సీజన్‌లో 4,13,974 ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేశారు.

కూలీల కొరత..

పసుపు, పత్తి సాగుకు గ్రామాల్లో వ్యవసాయ కూలీల కొరత ఏర్పడడంతో ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. దీంతో అధిక కూలితో పాటు రవాణా ఖర్చులు సైతం భరించాల్సి వస్తోంది. దీనికి తోడు ఇందనం ధరలు పెరుగుతుండడంతో యంత్రాల అద్దెలు పెంచడం వల్ల రైతులపై భారం పడుతోంది. గత యేడాది వానాకాలంలో పొలం దున్నేందుకు ట్రాక్టర్ అద్దె గంటకు రూ.1,200 ఉండగా ఈసారి రూ.1,500కు పెంచారు. గత యేడాది మగ కూలీలకు రూ.800 వరకు ఉండగా ప్రస్తుతం రూ.900, ఆడ కూలీకు రూ.400 వరకు ఉంటుంది. గత యేడాది పత్తి సాగుకు ఎకరాకు సుమారు రూ.30 వరకు పెట్టుబడి కాగా, ఈ యేడాది రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకు పెరిగే అవకాశం ఉందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఏపీ రూ.1,450కి పెంపు

గత యేడాదితో పోలిస్తే ప్రస్తుతం ఎరువుల

మిగతా 8వ పేజీలో



నృసిహుడిసన్నిధిలో భక్తుల రద్దీ
● ప్రత్యేక పూజలు 7

ధ్రువపత్రాలు పొందే సమయమిదే
పై చదువులకు సర్టిఫికెట్లు కీలకం
ముందస్తుగా పొందితే మేలు 6

భూ సమస్యలు పరిష్కరించాలి ● కలెక్టర్ సత్యప్రసాద్ 8

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడ్డెలింగాపూర్ ఎస్టీ మినీ గురుకుల (బాలికల) పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 6 సంవత్సరాలు నిండిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయాధికారి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 30 సీట్లు, 2వ తరగతిలో 8 సీట్లు, 5వ తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్ జె.శ్రీలత 9652141962లో సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మల్లాపూర్, మే, 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్ద అమృత సురేంద్ర అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్నలు శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ ఫలాలను తెలియజేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బాపురెడ్డి, హన్మంత్‌గౌడ్, నాయకులు ఆనంద్‌గౌడ్, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరరల్, మే 31(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ సుందర్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా జాబితాపూర్, లక్ష్మీపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

సర్దుబాటు ఉత్తర్వులతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం

-ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్

జగిత్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సర్కారు బడులు నిర్వీర్యం అవుతాయని స్టేట్ టీచర్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్‌లు అన్నారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంచాలని అందుకు ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని చెప్పిన అధికారులు సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను లేకుండా చేయడానికి పూనుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభం కాకుండానే, విద్యార్థుల నమోదును పట్టించుకోకుండా జూన్ 13వ తేదీ నాటికే సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని, తరగతికొక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నప్పటికీ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు పేరిట ఇతర పాఠశాలలకు తరలించాలనే నిర్ణయం ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలి పెట్టని, దాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జులై 31వ తేదీ వరకు ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆగస్టు ఒకటి తరువాత సర్దుబాటు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలను దెబ్బతీసేలా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను సవరణ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్

3 నుంచి భూభారతి గ్రామసభలు

జగిత్యాలరూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని భూభారతి గ్రామసభలు జూన్ 3 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. టీమ్-1 గ్రామాల్లో జూన్ 3వ తేదీన చల్‌గల్, 4న అంతర్గాం, 5న పొరండ్ల, 6న తాటిపల్లి, 9న కల్లెడ, 10 న వెల్దుర్తి, 11న పొరండ్ల, 12న మోరపల్లిలో గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. 13న ధర్మారం, 16న కండ్లపల్లి, 17న జాబితాపూర్, 18న నర్సింగాపూర్, 19న తిమ్మాపూర్, 20న లక్ష్మీపూర్‌లో గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. అలాగే టీమ్-2 లో జూన్ 4న గుల్లపేటలో, 6న హబ్సీపూర్‌లో, 10న సోమన్‌పల్లిలో, 12న కన్నాపూర్, 13న తక్కళ్లపల్లిలో, 17 నఅనంతారం గ్రామాల్లో భూభారతి సభలు నిర్వహిస్తామని జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

బాలిక వైద్యానికి రూ.1.21లక్షలు అందజేత

ధర్మపురి, మే 31 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నిరుపేద బాలిక వైద్యం కోసం ఎన్ఆర్ఐలు రూ.1.21 లక్షలు విరాళాలు అందించారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా దేవడ గ్రామానికి చెందిన చెనవెనవార్ సుభాష్-రేణుక దంపతుల పెద్ద కూతురు నిక్షిత(9) ఏడాది కాలం నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. సుభాష్ ఆటో ట్రాలీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ భారం అవుతున్న సుభాష్‌కు తన కూతురు వైద్య ఖర్చులు మరింత భారంగా మారాయి. వీరి సమస్యను మిత్రుల ద్వారా తెలుసుకున్న ధర్మపురి పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్పందించి మే 4న ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి సాయం అందించాలని కోరారు. ఎన్నారైలు స్పందించి సుభాష్ బ్యాంక్ ఖాతాకు రూ.1.21 లక్షలు పంపించారు. దాతల సాయంతో నిక్షితకు వైద్యం అందిస్తున్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

బీర్‌పూర్,మే 31(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉల్లాస్ నవ భారత్ సాక్షరతా కార్యక్రమంపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పాఠశాల విద్యావకాశం కోల్పోయిన 15సంవత్సరాలు, ఆపై బడిన నిరక్షరాస్యులకు జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా నిరంతర విద్యను అందించడమే ఉల్లాస్ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లచ్చాలు, ఎంఈవో నాగభూషణం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శైలజ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి

కథలాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పండగ సందర్భంగా గోవుల అక్రమ రవాణా చేయకుండా మండలంలోని సరిహద్దుల్లో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని శనివారం ఎస్సై నవీన్‌కుమార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. గోరక్షణకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు కథలాపూర్ మహేశ్, గాంధారి శ్రీనివాస్, కాశోజి ప్రతాప్, నరెడ్ల రవి, మల్యాల శ్రీకర్, గంగమల్లయ్య తదితరులు ఉన్నారు.

డీలర్లు రికార్డులు నిర్వహించాలి

కొడిమ్యాల, మే 31(ఆంధ్రజ్యోతి) : విత్తనాలు, ఎరువులను అమ్మే డీలర్లు రికార్డులను నిర్వహించాలని ఏవో పి. జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని నల్లగొండ, తిప్పయ్యపల్లి, హిమ్మతురావుపేట గ్రామాల్లోని ఎరువుల, విత్తనాల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు స్టాక్ అప్‌డేట్ చేయాలన్నారు. దుకాణాలలోని పత్తి, వరి విత్తనాల శాంపిల్స్‌ను తీసుకున్నారు.

ధూమపానంతో ప్రాణాంతక వ్యాధులు

-డీఎంహెచ్‌వో ప్రమోద్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

జగిత్యాల అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ధూమపానంతో ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తాయని డీఎంహెచ్‌వో ప్రమోద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య సిబ్బంది, అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానంతో కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సిగరెట్, బీడీ, గుట్కాల్లో ఉండే నికోటిన్ అనే విష పదార్థం వల్ల నోటి క్యాన్సర్, గుండెపోటు లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయని అన్నారు. ధూమపానంతో చుట్టు ప్రక్కల ఉన్న వారికి కూడా ప్రమాదమన్నారు. ధూమపానం వల్ల దేశంలో ఏటా లక్షలాది మంది బలవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, డాక్టర్ అర్చన, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ కోటగిరి సుధీర్, సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం, డిపిఓ రవీందర్, ఓ సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారులు ఎనుగంటి రాజేశం, మురళీ ధర్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

భీమారం, మే 31 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు అన్నారు. భీమారం మండలంలోని లింగంపేట గ్రామంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పంట మార్పిడి, మేలైన విత్తనాల సేకరణ, రసాయ ఎరువుల వాడకం, అధిక దిగుబడి గురించి రైతులకు వివరించారు. ఆయిల్‌పాం సాగు చేయడం వలన కోతుల బెడద ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్ నాయక్, సాధ్వీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మిట్టపల్లి రాజిరెడ్డి, ఏఈవో సురేందర్ నాయక్, హెచ్‌ఈవో అన్వేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి పద్మావతి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పద్మావతి


జగిత్యాల క్రైం, మే 30 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్పెషల్ సబ్ జైలును శనివారం న్యాయమూర్తి సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని నిందితులకు ప్రభుత్వం తరఫున ఉచిత న్యాయ సహాయ, సలహాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్ర మోహన్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సతీష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ విజయ్ కృష్ణ, సూపరింటెండెంట్లు షఫీ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అనంతరం జిల్లా కోర్టులో పదవీ విరమణ పొందిన తోకల రాజు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమలో ప్రధాన న్యాయమూర్తి పద్మావతి తదితరులు ఉన్నారు.

‘ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి’

వెల్గటూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి బోనగిరి ప్రభాకర్ కోరారు. విద్యార్థులు లేక మూతబడిన మండలంలోని కుమ్మరిపల్లి ప్రాథమిక పాఠశాలను తిరిగి తెరిచేలా మాజీ సర్పంచ్ కొప్పుల విద్యాసాగర్, ఉప సర్పంచ్ ముచ్చర్ల తిరుపతి, నాయకులు వేల్పుల రవి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. స్థానిక పాఠశాలను ఆదరించి బడిని పరిరక్షించుకోవాలని కోరారు. పిల్లలను స్థానిక బడిలో చేర్పిస్తే ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తామని అన్నారు. కార్యక్రమంలో పాశిగామ ప్రధానోపాధ్యాయులు నీలం సంపత్ కుమార్, సీఆర్పీ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

-ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, మే 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక ధరూర్ క్యాంప్ జడ్పీ హైస్కూల్‌లో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కాలానికి అనుగుణంగా విద్యాబోధనలో మార్పులకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాముతో పాటు, మాజీ కౌన్సిలర్ వొద్దినేని శ్రీలత రాంమోహన్, కోర్సు డైరెక్టర్ బాసిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావోపై ప్రచారం చేయాలి

-జిల్లా పాలనాధికారి సత్యప్రసాద్

జగిత్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బహుళ సభ్యుల అధికారిక సమావేశం కలెక్టర్ బుడుమజ్జి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావోపై విస్తృతమైన ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. గర్భవతిగా నమోదు అయినప్పటి నుంచే ఆశా కార్యకర్తలు ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ చేయాలని తెలిపారు. స్కానింగ్ సెంటర్లలో గర్భవతులకు స్కానింగ్ చేసినప్పుడు విధిగా ఫారం ఎఫ్‌లను నింపి దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అబార్షన్ జరిగినటువంటి వారిపైన ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. ఏ కారణం చేత అబార్షన్ అయిందో గుర్తించాలని ఆదేశించారు.

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తు చేసుకున్నటువంటి మూడు నూతన స్కానింగ్ రిజిస్ట్రేషన్ సెంటర్స్, 10 రెన్యువల్ సెంటర్స్‌కు అనుమతి ఇచ్చే విషయం గురించి కలెక్టర్‌కు నివేదించామని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు అతిక్రమించిన మూడు స్కానింగ్ సెంటర్లకు జరిమానా విధించడం మరియు హెచ్చరిక నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, జగిత్యాల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ సుధీర్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం, ఆరోగ్య పర్యవేక్షకులు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

తప్పిపోయిన చిన్నారి.. తల్లిదండ్రులకు అప్పగింత

కోల్‌సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని లక్ష్మీనగర్‌లో ఓకుటుంబం ఐదుసంవత్సరాల పాపతో షాపింగ్‌కు వచ్చారు. పాప ఆడుకుంటూ బయటకు వెళ్లి లక్ష్మీనగర్ నుంచి గాంధీచౌక్ వెళ్లింది. ఆమెకు దారి తెలియపోవడంతో గుర్తించిన స్థానికులు బ్లూకోట్స్‌కు సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సిబ్బంది పాపతల్లిదండ్రుల గురించి వాకబు చేశారు. తల్లిదండ్రుల వివరాలను గుర్తించేందుకు సోషల్‌మీడియాలో ప్రచా రం చేయించారు. పాప బ్లూకోట్స్‌వద్ద ఉన్న సమాచారం తెలుసుకొని ఆమెతల్లిదండ్రులు పోలీసులను సంప్రదించారు. తప్పిపోయిన చిన్నారిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. బ్లూకోట్స్ సిబ్బంది తిరుపతి, నవీన్‌లను సీఐ ఇంద్రసేనారెడ్డి అభినందించారు.

4న వాహనాల వేలం

పెద్దపల్లిటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : వివిధ కేసులలో పట్టుబడిన 10 వాహనాలకు ఈనెల4న ఉదయం 11 గంటలకు పెద్దపల్లి ఎక్సైజ్‌స్టేషన్ బండారికుంటలో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ కె నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంవేసే వాహనాలలో టీవీఎస్ స్టార్ సిటీ, టాటా సుమో, టీవీఎస్ ఎక్సెల్, హీరో గ్లామర్, హోండా యాక్టివా, హోండా షైన్ వాహనాలు కండీషన్‌లో ఉన్నాయన్నారు. మరోనాలుగు ద్విచక్రవాహనాలు స్క్రాప్ కండిషన్‌లో ఉన్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి గలవారు ఈనెల 4న ఉదయం 10 గంటల లోగా ధరావతు డబ్బులు డిపాజిట్‌చేసి రసీదు తీసుకోవాలని, ఉదయం 11గంటలకు వేలం జరుగుతుందని తెలిపారు. వివరాలకు కార్యాలయ పని వేళలో ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ధ్రువపత్రాలు పొందే సమయమిదే..



- పై చదువులకు సర్టిఫికెట్లే కీలకం
- ముందస్తుగా పొందితే మేలు

వెల్గటూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆపై చదువుల కోసం కుల, ఆదాయ, స్థానిక ధ్రువపత్రాలు చాలా కీలకం. వీటిని ఎలా పొందాలో విద్యార్థులు అవగాహన పెంచుకోవడం అవసరం. సకాలంలో ధ్రువపత్రాలు పొందలేకపోతే సంబంధిత కళాశాలల్లో సీటు కోల్పోయే ప్రమాదం ఉంది. జూన్‌లో విద్యా సంవత్సరం మొదలవుతుంది. అందరూ ఒకేసారి దరఖాస్తు చేస్తే వ్యయ ప్రయాసలు, సర్వర్ సమస్యలు ఎదురవుతాయి. చివర్లో హడావుడి పడితే ఒత్తిడికి గురికావాల్సి ఉంటుంది. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు పాలిటెక్నిక్, ఇంటర్, ఐటీఐ వంటి కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారు. ఇంటర్ పూర్తి చేసిన వారు బీటెక్, మెడిసిన్, బీఫార్మసీ, ఇతర డిగ్రీ కోర్సుల్లో చేరుతుంటారు. ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకుంటే మేలు అని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

● అవసరమైన ధ్రువపత్రాలు..

పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒకటి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలతో పాటు చదువులపరంగా గ్యాప్ ఉంటే దానికి సంబంధించి తహసీల్దార్ జారీ చేసిన పత్రం కావాలి. ఆదాయ ధ్రువపత్రాన్ని ఏడాదికి ఒకసారి తీసుకోవాలి. స్థానికత కోసం సంబంధిత బోనఫైడ్లు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలి. ఈబీసీ (ఆర్థికంగా వెనుకబడిన వర్గం)కి చెందిన ధ్రువపత్రం కోసం ఆధార్, రేషన్‌కార్డుతో పాటు అఫిడవిట్ జత చేయాల్సి ఉంటుంది. ఫార్మసీ, ఎప్‌సెట్, నీట్‌తో పాటు వివిధ రకాల ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఎంట్రన్స్ టెస్ట్ హాల్ టికెట్, అలాట్‌మెంట్ లెటర్, ర్యాంక్ కార్డు, ఒకటి నుంచి ఇంటర్, డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు, మెమోలు, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డు, ఫోటోలు అవసరం అవుతాయి. కొన్ని సందర్భాలలో నాన్ క్రిమిలేయర్ సర్టిఫికేట్ కూడా అవసరం పడుతుంది. సమయానికి కులం, ఆదాయం సర్టిఫికెట్లు సమర్పించకపోతే ఫీజు రీయింబర్స్‌మెంట్ కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

ధ్రువీకరణ పత్రం	పొందే సమయం	రుసుము
కులం, జననం	30 రోజులు	రూ.45
ఆదాయం	7 రోజులు	రూ.45
నివాసం	7 రోజులు	రూ.45
ఓబీసీ	30 రోజులు	రూ.45
ఈబీసీ	7 రోజులు	రూ.45
స్థానికత	30 రోజులు	రూ.45
ఫ్యామిలీ మెంబర్	30 రోజులు	రూ.45

● ధ్రువపత్రాలు ఎలా పొందాలి..?

కులం, ఆదాయం, నివాసం ధ్రువపత్రాల కోసం సంబంధిత దరఖాస్తు ఫారాలు నింపి ఆధార్, రేషన్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు మీ సేవా కేంద్రంలో సమర్పించాలి. గ్యాప్ సర్టిఫికెట్ కోసం అఫిడవిట్, పోలీస్ క్లియరెన్స్ స్టడీ సర్టిఫికెట్లు జత చేయాలి. ఒక్కో దానికి రూ.45 మీ సేవలో చెల్లించాలి. ఆర్ఐ, నాయబ్ తహసీల్దార్ పరిశీలించి ఆన్‌లైన్‌లో తహసీల్దార్ లాగిన్‌కు చేరవేస్తారు. తహసీల్దార్ పరిశీలించి డిజిటల్ సంతకం చేస్తారు. అనంతరం విద్యార్థి సెల్‌నంబరుకు మెసేజ్ రాగానే మీ సేవకు వెళ్లి ధ్రువపత్రాలు తీసుకోవాలి.

ముందుగా దరఖాస్తు చేసుకుంటే మేలు

-శేఖర్, తహసీల్దార్, వెల్గటూర్



విద్యార్థులు ఉన్నత చదువులకు కావలసిన ధ్రువీకరణ పత్రాలను ముందుగానే దరఖాస్తు చేసుకుంటే మంచిది. నిర్ణీత వ్యవధిలోనే ధ్రువపత్రాలు అందజేస్తున్నాం. అప్పుడప్పుడు సర్వర్ సమస్యలు వస్తే ఆలస్యం అవుతుంది. పత్రాలు అవసరం ఉన్నప్పుడే హడావుడి పడితే ఒత్తిడికి గురికావాల్సి ఉంటుంది. దళారులను ఆశ్రయించి డబ్బులు వృథా చేసుకోకుండా మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

చెరువులో స్నానానికి వెళ్లి ఒకరి మృతి



మహేష్(ఫైల్)

తిమ్మాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండలకేంద్రంలోని ఊరచెరువులో ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులుతెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌జిల్లా, పూటూర్ మండలం దంతెనపల్లి గ్రామానికిచెందిన గోనె మహేష్ (35)కు తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన తమ్మ మౌనికకు వివాహం జరిగింది. ఇటీవల అత్తగారింటికి వచ్చిన మహేష్ శనివారం గ్రామశివారులోని ఊర చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. స్థానికులు చెరువులో ఓ మృతదేహం తేలుతూ కనిపించడంతో ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై వివేక్ గ్రామస్థుల సహకారంతో చెరువలో నుంచి మృతదేహన్ని బయటకు తీయించారు. మృతుడు గోనె మహేష్‌గా గుర్తించారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆటో బోల్తాపడి ఒకరు మృతి

జగిత్యాలరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామశివారులో ఆటో బోల్తాపడి బుగ్గారం మండలం వెల్గొండకు చెందిన గంధం రాజన్న(42) అనే ఆటోడ్రైవర్ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపారు. రాజన్న జగిత్యాలలో కూరగాయలు అమ్మేందుకు శనివారం తెల్లవారుజామున తన ఆటోలో వెళ్తుండగా నిద్రమత్తులో నడపడంతో అదుపుతప్పి బోర్లాపడింది. బలమైన గాయంకావడంతో రాజన్న ప్రమాదస్థలిలోనే మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ తెలిపారు.

భవనం పై నుంచి పడి మేస్త్రీ మృతి

జగిత్యాల క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో భవన నిర్మాణ పనులు చేస్తుండగా శనివారం ప్రమాదవశాత్తు కాలు జారి రెండో అంతస్తు నుంచి కింద పడి నస్కూరి సత్యనారాయణ(39) అనే మేస్త్రీ మృతిచెందాడు. పట్టణంలోని తులసీనగర్‌కు చెందిన సత్యనారాయణ నూతనంగా నిర్మిస్తున్న రెండో అంతస్థులో సిమెంట్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో పొట్టభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన కుక్క రమేశ్(40) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్కలకు చెందిన రమేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసై పని పాటలేకుండా తిరుగుతున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి పడుకున్న రమేశ్ శనివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూసే సరికి ఇంటిలోని దూలానికి ఉరివేసుకొని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన తీరును పరిశీలించారు. భార్య లత ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని రైలు కిందపడి ఒకరి బలవన్మరణం



సత్యనారాయణ(ఫైల్)

అంతర్గాం, మే 31 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణం పాముల పేటకు చెందిన గన్నా సత్యనారాయణ(46) పెద్దంపేట రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. రామగుండం రైల్వే జీఆర్‌పీ ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం సత్యనారాయణ గతంలో బీథర్మల్‌లో కాంట్రాక్టుకార్మికుడిగా పనిచేశాడు. ప్రస్తుతం వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం ఆర్థికంగా నష్టపోయి మానసికంగా కృంగిపోయాడు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని రైల్వే జీఆర్‌పీ పోలీసులు సందర్శించి శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గోదావరిఖని ప్రభుత్వఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. సత్యనారాయణకు భార్య స్వరూప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సత్యనారాయణ భార్య ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొళ్లపల్లికిచెందిన కనుకుంట్ల శ్రీనివాస్ (18) చికిత్సపొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలప్రకారం శ్రీనివాస్ ఇంటర్మీడియట్‌లో ఫెయిల్‌కాగా అప్పటినుంచి ఖాళీగా ఉంటున్నాడు. తల్లి గీత ఖాళీగా తిరగవద్దని సూచించగా మనస్తాపానికి గురై ఏప్రిల్23న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు పెద్దపల్లి అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం వరంగల్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడితల్లి గీతఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తుచేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

క్రికెట్ లీగ్ పోటీల్లో పెద్దపల్లి, కరీంనగర్ రూరల్ విజయం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్‌జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న రెండురోజుల ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్‌పోటీలు కొనసాగుతున్నాయి. శనివారం ముగిసిన లీగ్‌పోటీల్లో పెద్దపల్లి, కరీంనగర్ జట్లు విజయం సాధించాయి. కరీంనగర్ టౌన్, జగిత్యాలజట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని సెయింట్ అల్ఫోన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన మొదటి మ్యాచ్ హుజూరాబాద్, పెద్దపల్లిజట్ల మధ్య జరిగింది. పెద్దపల్లి జట్టు ఇన్నింగ్స్ 81 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్ జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించగా ఈ మ్యాచ్‌లో కరీంనగర్ టౌన్, జగిత్యాల జట్లు తలపడ్డాయి. జగిత్యాల జట్టును కరీంనగర్ జట్టు ఆలౌట్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వేములవాడలో నిర్వహించిన మూడో మ్యాచ్‌లో సిరిసిల్ల, కరీంనగర్ రూరల్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో కరీంనగర్ రూరల్ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కరీంనగర్‌టౌన్ జట్టుకు చెందిన అక్షం 132 పరుగులు చేసి నాటౌట్‌గా నిలవడం విశేషం. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగమరావు, మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు మహేందర్‌గౌడ్,మనోహర్‌రావుమ్యాచ్‌లను పర్యవేక్షిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ట్రైనీఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండానే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ పేర్కొన్నారు.

నేలకూలిన భారీ వృక్షం.. రెండు వాహనాలు ధ్వంసం



భారీ వృక్షం నేలకూలడంతో దెబ్బతిన్న వాహనాలు

ధర్మారం, మే 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న పురాతన చింతచెట్టు శనివారం నేలకూలింది. ఈ సంఘటనలో రెండు జీపులు ధ్వంసమయ్యాయి. ధర్మారం ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి పెద్దపల్లికి కొందరు డ్రైవర్లు 30సంవత్సరాలుగా జీపులు నడు పుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఇందులో భాగంగా ఎప్పటిలాగే శనివారం ఉదయం రెడపాక లక్ష్మణ్, మదాసు తిరుపతిలు చెట్టు కింద అడ్డాపై జీపులు నిలిపి సమీపంలో మాట్లాడుకుంటున్నారు. ఇంతలో గాలి, వాన ఏమీ లేకుండానే ఒక్కసారిగా భారీ వృక్షం కూలి రెండు జీపులపై పడింది. దీంతో జీపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ధర్మారం మండల జీప్‌యూనియన్ అధ్యక్షుడు కాడే సూర్య నారాయణ ఆర్‌టీసీ అధికారులతో మాట్లాడి చెట్టును తీయించారు. జీపు నడుపుకుంటేనే పూట గడుస్తుందని, వాహనాలు పూర్తిగా దెబ్బతినడంతో 2లక్షల రూపాయల నష్టం జరిగిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

అటవీ భూమిని కబ్జా చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్

బీర్‌పూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): అటవీ భూమిని కబ్జా చేసి అటవీ ప్రాంతంలోని జంతువుల కోసం ఏర్పాటు చేసిన నీటి గుంతను ధ్వంసం చేసిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ధర్మపురి రేంజ్ అధికారి శ్రీనాథ్ శనివారం తెలిపారు. బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్ గ్రామానికి చెందిన బోడ సాగర్ అనే వ్యక్తి రంగసాగర్ శివారు అటవీ ప్రాంతంలో గల భూమిని కబ్జా చేసి నీటి గుంతను ధ్వంసం చేశాడన్నారు.

సాగర్‌పై అటవీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి జగిత్యాల కోర్టుకు అప్పగించగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్



ఇల్లందకుంట మండలం రాచపల్లిలో మాట్లాడుతున్న జడ్జి కిరణ్‌కుమార్

ఇల్లందకుంట, మే 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి పీబీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని రాచపల్లి గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అదే విధంగా జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను నిషేధించాలన్నారు.

పొగాకు, గుట్కా, అంబర్, పాన్‌మసాలను వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్, వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాస్, కోశాధికారి భానుకిరణ్, తిరుపతి, రవితేజ, ట్రైనీ ఎస్ఐ దిలీప్‌కుమార్, పంచాయతీ సెక్రెటరీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురి బైండోవర్

కరీంనగర్ క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తూ గతంలో పోలీసులకు పట్టుబడి, కేసులు నమోదైన ఐదుగురిని శనివారం స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు


- ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం
- రూ.10,500 జరిమానా

కోరుట్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని కిరాణ దుకాణాలు, రెస్టా రెంట్లు, టిఫిన్ సెంటర్లలో శనివారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించి నిలువ ఉన్న ప్లాస్టిక్‌కవర్లను స్వాధీనం చేసుకున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి నిల్వఉన్న తిను బండారాలను స్వాధీనం చేసుకున్నారు. పలు దుకాణాలు, రెస్టారెంట్ల యజమానులకు రూ.10,500 జరిమానాలు విధించి నట్లు అధికారులు తెలిపారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టితవ్వకాల ప్రదేశాన్ని పరిశీలించిన తహసీల్దార్

తిమ్మాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపల్లి శివారులో 69సర్వేనంబరులో కర్షలగుట్ట వద్ద మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. శుక్రవారం గ్రామ స్థులు మట్టిని తరలిస్తున్న టిప్పర్లును పట్టుకొని అధికారులకు అప్పగిం చడం తెలిసిందే. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితం రావడంతో జిల్లా ఉన్నతాధికారులు మండల అధికారులను నివేదిక కోరారు. దీంతో తిమ్మాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పోలంపల్లి గ్రామశివారులోని మట్టి, బండరాళ్ల తవ్వకాలు జరుపుతున్న కర్షల గుట్టను పరిశీలించారు. మల్లాపూర్ గ్రామశివారులోని 104సర్వే నెంబరు నుంచి జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం బండరాళ్ల తవ్వకాలకు అనుమతి తీసుకున్నారు. కానీ అక్కడ తవ్వకాలు జరపకుండా పోలంపల్లిలోని 69సర్వే నంబర్‌లో మట్టి, బండరాళ్లు తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా అనుమతి ఒక చోట తవ్వకాలు మరోచోట జరిపినట్లు గుర్తించామని తహసీల్దార్ తెలిపారు. పూర్తినివేదికను ఉన్నతధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. పట్టుకున్నటిప్పర్లు తమ ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు.

ప్రతి పనికి లంచమే..



- అవినీతి ఉద్యోగులపై ఏసీబీ కొరడా
- మొన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్... నేడు సర్వేయర్

సిరిసిల్ల క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిపనికి లంచం తప్పనిసరైంది. లంచం ఇవ్వందే ఫైలు కదలడంలేదు. ప్రతి పనికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22 రోజుల్లో ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారు. జిల్లాలో ప్రతి ఏటా పలువురు అధికారులు ఏసీబీ వలలో చిక్కి కటకటాల పాలవుతున్నారు. అయినప్పటికీ లంచం డిమాండ్ చేయడం తగ్గడంలేదు.

● బిల్లు పాస్ చేయడానికి..

రాజన్న సిరిసిల్ల జిల్లా నీటి పారుదలశాఖ ఏడో డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎర్రంరెడ్డి అమరేందర్‌రెడ్డి మే 9న ఓ కాంట్రాక్టర్ వద్ద బిల్ పాస్ చేయడానికి లంచం తీసుకుంటూ కరీంనగర్‌లో ఏసీ బీ వలకు చిక్కాడు. ముస్తాబాద్ మండలంలోని ఆవు నూరు, అగ్రహారం మధ్య లో ఎనిమిది కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం బిల్లుల విడుదలకు హన్మకొండకు చెందిన సూరం రవీందర్ అనే కాంట్రాక్టర్‌ను లక్ష రూపాయలు డిమాండ్ చేయగా 75 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ మేరకు కరీంనగర్‌లోని విద్యారణ్యపురి కాలనీలో నివా సం ఉంటున్న ఈఈ అమరేందర్‌రెడ్డి తన ఇంట్లో కాంట్రాక్టర్ రవీందర్ వద్ద 60 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి పట్టుకున్నారు. చెక్‌డ్యాంను రెండేళ్ల క్రితమే పూర్తిచేసినప్పటికీ బిల్లుల మంజూరులో నీటిపారుదలశాఖ అధికారులు అలసత్వం ప్రదర్శించారు. చివరికి 60 వేల లంచం తీసుకుంటూ ఈఈ అమరేందర్‌రెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కి కటకటాలపాలయ్యాడు.

● అధికారుల ఆస్తులపై ఏసీబీ నజర్

జిల్లాలో 22రోజుల్లో ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో వారి ఆస్తులపై ఏసీబీ నజర్ పెట్టింది. ఈ మేరకు ఈఈ అమరేందర్‌రెడ్డి ఆస్తులపై విచారణ చేపట్టింది. సర్వేయర్ నాగరాజు ఆస్తులపై ఏసీబీ విచారణ చేపట్టి అంచనాలు వేస్తోంది. ఆదాయానికి మించి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేస్తుంది. అయిదేళ్లలో జిల్లాలో పనిచేసిన పంచాయతీరాజ్ శాఖ డీఈఈ మత్స్యశాఖ జూనియర్ అసిస్టెంట్, మునిసిపల్ కమిషనర్, ఫారెస్ట్ రేంజ్ అధికారిని, ఓ సర్వేయర్, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ ఏసీబీ అధికారుల చేతికి చిక్కి కటకటాలపాలయ్యారు.

● భూమి కొలత ధ్రువీకరణ కోసం రూ. లక్ష డిమాండ్

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన జక్కాపురం మల్లేషం అనే రైతు తన భూమి కొలతలకు ఎల్లారెడ్డిపేట రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే సర్వేయర్ నాగరాజును ఆశ్రయించాడు. వ్యవసాయ భూమి కొలతలు చేసి పంచనామా ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి సర్వేయర్ నాగరాజు మల్లేశంను లక్ష రూపాయల లంచం డిమాడ్ చేశాడు. దీంతో మల్లేషం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శనివారం నాగరాజుకు రూ. 15 వేల లంచం ఇస్తుండగా అక్కడే నిఘా వేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

● ఉద్యోగ విరమణ రోజు.. లంచగొండి భరతం పట్టి



నిందితుడు నాగరాజు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఉద్యోగ విరమణ శనివారం ఉన్నా.. ఆయన లంచగొండి అధికారి భరతం పట్టారు. ఆరు గుంటల స్థలానికి కొలతలు వేసి ధ్రువీకరణ పత్రం అందించేందుకు మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు జక్కపురం మల్లేశం వద్ద సర్వేయర్ నాగరాజు రూ.లక్ష డిమాండ్ చేశాడని బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దాంతో డీఎస్పీ రమణమూర్తి ఉద్యోగ విరమణ ఉన్నా రంగంలోకి దిగి పట్టుకున్నారు.

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

- మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు
- గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క
- గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.


పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్టు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేశ్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్ వద్ద ధర్నా

- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసినందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా?"అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవత మండిపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.


జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కుల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్


పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతున్న జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిసలైన వారిని కాపాడే బాధ్యతను తల్లిదండ్రులు, గురువులు, సమాజం తీసుకోవాలని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గర్రెపల్లి పంచాయతీ ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. జడ్జి మాట్లాడుతు ధూమపానం, పొగాకు ఉత్పత్తులను సేవిండం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రమాదాలు నష్టాల గురించి వివరించారు. అనంతరం పొగాకు, డ్రగ్స్ కల్తీ కల్లుపై అప్రమత్తంగా ఉండేలనే నినాదాలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరిస్తామంటూ పాల్గొన్న వారిచే ప్రతిజ్ఞ చేయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి భూమయ్య, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ మెంబర్స్ మాదూరి ఆంజనేయులు, న్యాయవాదులు ఆవుల శివకృష్ణ, గుడ్ల వెంకటేశ్, రుద్రారపు నర్సయ్య, పడాల అంజయ్య, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఎస్ఐ, నాయకులు పాల్గొన్నారు.

కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- గోశాలను తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు


కోడెను పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడ కల్చరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి గోశాలలోని కోడెల సంరక్షణపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలోని రాజన్నకోడెలపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'కోడె గోస చూడు.. రాజన్నా..' అనే కథనానికి అధికారులు స్పందించారు. గోశాలలోని కోడెలను శనివారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో ఎనిమిది కోడెలు చనిపోయాయని తెలిపారు. పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో కోడెలకు నిరంతరం వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

● సామర్థ్యానికి మించి కోడెలు ఉండడంతోనే సమస్య

- దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు

వేములవాడ రాజన్న ఆలయ తిప్పాపూర్ గోశాలను దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అనారోగ్యంతో వున్న కోడెల శాంపిల్‌ను సేకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గోశాలలో సామర్థ్యానికి మించి కోడెలు ఉండడంతో సమస్యలు వస్తున్నాయన్నారు. అనారోగ్యంతో వున్న కోడెలను వేరుగా ఉంచాలన్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని తెలిపారు. మరో మూడు షెడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఆయనవెంట దేవాదాయ జాయింట్ కమిషనర్ కృష్ణప్రసాద్, వెటర్నరీ వైద్యులు విజయభాస్కర్‌రెడ్డి, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఉన్నారు.

మరో ఐదు కోడెల మృతి

రాజరాజేశ్వరస్వామి గోశాలలో శుక్రవారం అర్ధరాత్రి మరో 5 కోడెలు మృతి చెందినట్లు తెలుస్తోంది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు గోశాల తనిఖీ వస్తున్నట్లు తెలుసుకున్న గోశాలసిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా కళేబరాలను తరలించి ఖననం చేసినట్లు సమాచారం. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా శనివారం కోడెలు మృతి చెందలేదని తెలిపారు.

నేడు చిన్న కోడెల పంపిణీ

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రాజరాజేశ్వర స్వామి వారి తిప్పాపూర్ గోశాలలోని 300 చిన్న కోడెలను ఆదివారం పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పుస్తకాలు ఉన్న రైతులకు జియో ట్యాగింగ్ ఉన్న చిన్న కోడెలను పంపిణీ చేస్తామని, రైతులు వాటి సంరక్షణను సక్రమంగా చూసుకోవాలని సూచించారు.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మే 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. అనుబంధఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

యువకుడు అదృశ్యం.. కేసు నమోదు


లక్ష్మణ్ (ఫైల్)

మానకొండూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లక్ష్మణ్ (21) అనే యువకుడు కనిపించకుండా పోయాడని శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయింది. సీఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లావణ్య-అంజయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక్క కుమార్తె ఉన్నారు. రెండవ కుమారుడు లక్ష్మణ్ పదవతరగతి వరకు చదువుకున్నాడు. ఈనెల 27న రాత్రి 8.30గంటల ప్రాంతంలో ఇంటినుంచి బయటికి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. అతనికోసం చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా జాడ తెలియలేదు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నంబాల కేశవరావు మృతిపై విచారణకు ఆదేశించాలి

- చర్చలకు కేంద్రం పెద్దన్న పాత్ర పోషించాలి
- పాకిస్తాన్ నమ్మదగిన దేశం కాదు
- నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే
- సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

సుల్తానాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో అనేక విషయాలు వెలుగు చూస్తున్నాయని, ఎన్‌కౌంటర్ కాదని అతడిని పట్టుకుని కాల్చి చంపారనే చర్చ కొనసాగుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, మాజీఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో శనివారం సీపీఐ మండల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కేశవరావు మృతి విషయంలో జ్యూడిషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్‌చేశారు. మావోయిస్టులను హతమారుస్తున్న ప్రభుత్వం వారి సిద్ధాంతాలను ఏమీ చేయలేరని, అవి సజీవంగా ఉంటాయని అన్నారు. హతమార్చడం సమస్యకు పరిష్కారం కాదని కేంద్రం పెద్దన్నపాత్ర పోషించి మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించాలన్నారు. మీరు అనుకున్న సన్మార్గం వైపు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలే తప్ప ఎన్‌కౌంటర్లు సరి కాదన్నారు. ఉగ్రవాద దేశమైన పాకిస్థాన్‌తో చర్చలు జరుపుతున్న కేంద్ర పెద్దలు మన దేశపు బిడ్డలతో మాట్లాడలేరా అని ప్రశ్నించారు. భారత్-పాకిస్థాన్ యుద్ధం ఆగినా ఉగ్రవాదం కొనసాగుతుందని, పాక్ నమ్మదగిన దేశం కాదని, మనదేశంలోని సైనిక వ్యవస్థలు, కేంద్రం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు లేక అభివృద్ధికి నిధులు లేక కుంటుపడ్డాయన్నారు. స్థానిక సంస్థలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ శత జయంతి ఉత్సవాలలో భాగంగా దేశవ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు కొత్తకమిటీలు పూర్తిచేసి సెప్టెంబర్ 21నుంచి 26వరకు పంజాబ్‌లోని చండీ గడ్‌లో జాతీయ సభలు జరుపుతామన్నారు. ఆగస్టులో మేడ్చల్‌లో రాష్ట్ర సభలు, జూన్28నపెద్దపల్లిజిల్లా మహసభలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కలవేనశంకర్, సీపీఐజిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏఐటీయుసి జిల్లా జనరల్ సెక్రటరీ కడారి సునిల్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగావచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అబిషేకపూజలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.


ఆలయ ఆవరణలో భక్తులు

● ఎస్పీకి ఆలయ అధికారుల సన్మానం

ఇటీవల జరిగిన పెద్దహనుమాన్ జయంతి సందర్భంగా పోలీస్‌శాఖ తరుపున అన్నిశాఖల అధికారులను సమన్వయంచేస్తూ ఉత్సవాలు విజయవంతానికి కృషిచేశారంటూ ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఈవో శ్రీకాంత్‌రావు ఇతర అధికారులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీని సత్కరించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. ఈవో వెంట పర్యవేక్షకులు సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

జగిత్యాలరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్, రూరల్ మండలలాల్లోని ఏర్పాటు చేసి ఐకేపీ ధాన్యం కొనుగోళ్ల పూర్తిస్థాయిలో దిగ్విజయంగా పూర్తి చేసినట్లు జగిత్యాల మండల ఐకేపీ ఏపీఎం ఓడెల గంగాధర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల రూరల్ మండలంలోని 18 ఐకేపీ సెంటర్ల ద్వారా 2770 రైతుల నుండి 153200 క్వింటాళ్లు, అర్బన్ మండలం లో 634 రైతుల నుండి 41178 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు తెలిపారు.

●పెగడపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెగడపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో శనివారంతో ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు సంఘం చైర్మన్ ఓరుగంటి రమణారావు, సీఈఓ తడకమడ్ల గోపాల్ రెడ్డిలు తెలిపారు. మండలంలోని పెగడపల్లి, వెంగళాయిపేట, మద్దులపల్లి, దోమలకుంట, ఆరవెల్లి, బతికెపల్లి, కొండయ్యపల్లి, లింగాపూర్, శాలపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలలో 2037 మంది రైతుల వద్ద 1,27,682 క్వింటాల్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. దాదాపు 30 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా 28 కోట్ల మేర రైతుల ఖాతాలలో జమ చేసినట్లు , మిగతా రైతులకు సైతం రెండు మూడు రోజులలో ఖాతాలలో డబ్బులు జమ కానున్నట్లు సీఈవో తెలిపారు.

విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని పూజలు

కథలాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలని కోరుతూ మండలంలోని అంబారిపేట ఓంకారేశ్వర స్వామి ఆలయంలో శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనునిత్యం ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ఆది శ్రీనివాస్‌కు వెనకబడిన తరగతుల విభాగంలోని మున్నూరు కాపు కోటాలో మంత్రి పదవి కేటాయించేలా చూడాలని స్వామివారికి మొక్కుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జవ్వాజి రవి, ఏఎంసీ డైరెక్టర్ జగన్‌రావు, తిక్క రవి, తోకల దేవయ్య, రాచమల్ల నవీన్ ఉన్నారు.

గ్రామ సభల్లో భూ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): భూ భారతి గ్రామ సభల్లో భూ సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో భూ భారతిపై జిల్లా రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడారు. జూన్ 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. గ్రామాల్లో ప్రచారం చేసి, దరఖాస్తు ఫారంలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దారు రెండు టీంలుగా ఏర్పడి ఎప్పటికపుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టరు బీఎస్ లత, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కోరుట్ల రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను కోరుట్ల ఆర్డీఓ జీవకర్‌రెడ్డితో కలిసి అందించారు. మండలంలోని వెంటాపూర్, గుమ్లాపూర్, సంగెం, నాగులపేట, మోహన్‌రావుపేట గ్రామాలకు చెందిన 114 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. మండలంలోని ఇప్పటి వరకు 414 మంది లబ్ధిదారులుగా ఎంపికయినట్లు అధికారులు ప్రకటించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులు మండల స్థాయి అధికారులు పర్యవేక్షించి లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ హౌసింగ్ అధికారి ప్రసాద్, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో రామకృష్ణతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'దళితులపై వివక్ష చూపితే చర్యలు'


తుర్తిలో సివిల్ రైట్స్ డేలో పాల్గొన్న అధికారులు

కథలాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి) : దళితులపై వివక్ష చూపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ నగేశ్ పేర్కొన్నారు. మండలంలోని తుర్తి గ్రామ పంచాయతీలో శనివారం ఏర్పాటు చేసిన పౌరహక్కుల దినం సందర్భంగా అవగాహన కల్పించారు. రాజ్యాంగం అన్ని వర్గాలను సమానంగా చూస్తుందని దళితులను అంటరానివారిగా చూడడం చట్టపరంగా నేరమని అన్నారు. హోటళ్లలో రెండు గ్లాసుల విధానం, ఆలయాల్లోకి ప్రవేశం లేకుండా చూస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, దళిత సంఘాల సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

●పెగడపల్లి: సమాజంలో పౌరులందరు సమానులేనని, కులాల పేరుతో వివక్షకు గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని పెగడపల్లి మండల పంచాయతీ అధికారి మహేందర్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని అయిత్‌పల్లిలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో అధికారులు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగం ఎంతో అభివృద్ధి చెందిన తరుణంలో సైతం కులాలు, మూఢనమ్మకాలను నమ్మడం తగదని, సమాజంలో అందరిని ఒకలాగే చూడాలన్నారు. సమావేశంలో ట్రైనీ ఎస్‌ఐ రవీందర్ , గిర్దావర్ జమున, హెల్త్ సీహెచ్‌ఓ మహేందర్ రెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

●గొల్లపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం భీంరాజ్ పల్లె గ్రామంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో రెవెన్యూ శాఖ నుంచి ఆర్‌ఐ అనూష, పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఎంపీవో సురేష్ రెడ్డి మినహాయించి ఇతర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో గ్రామ సభ నామమాత్రంగా ముగిసింది.

ఆలయ కమిటీ ఎన్నిక

కోరుట్ల, మే 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాయిబాబ దేవాలయ అభివృద్ధి నూతన కమిటిని దేవాలయ శాఖ అధికారులు ప్రకటించినట్లు దేవాలయ ఈఓ కాంతారెడ్డి శనివారం తెలిపారు. అభివృద్ధి కమిటి సభ్యులుగా బాలె నర్సయ్య, గడ్డం కిరణ్, నేమూరి భూమయ్య, పెంట అర్వింద్, అల్లె సదాశివ్, నిమ్మల శ్రీనివాస్, రాచకొండ దేవరాజం, కోటగిరి నాగభూషణం, చిలివేరి విద్యాసాగర్ రావు అను నియమించినట్లు తెలిపారు. నూతన కమిటి సభ్యులతో దేవాలయ ఈఓ కాంతారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను జరిపి సన్మానించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు నూతన కమిటీని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రమేష్ శర్మ, కిరణ్ శర్మ, వినయ్‌లు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

ధర్మపురి, మే 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్ ఇటీవల గుండె పోటుతో మృతి చెందగా కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన సునీల్‌కుమార్ మృతి వివరాలు అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

మల్లాపూర్, మే, 31 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ తహసీల్దార్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌గౌడ్‌ను మండలంలోని గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం కార్యాలయానికి వెళ్లి ఆయనను శాలువలతో సన్మానించి సీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఆయా పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

దేశం కోసం పోరాడిన వీర వనిత అహల్యాబాయ్


శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, మే31 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం, ధర్మం కోసం పోరాడిన ధీరవనితరాణి అహల్యాబాయ్ హోల్కర్ అని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. రాణి అహల్యాబాయ్ 300 జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని స్థానిక టౌన్‌హాల్ నుంచి పాత బస్టాండ్ వరకు బీజేపీ శ్రేణులతో కలిసి భారీ శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500మంది మహిళలతో సైన్యాన్ని నెలకొల్పుకొని 28ఏళ్ల పాటు పాలన సాగించిన ధీర వనితగా ఖ్యాతి గడించారన్నారు.

పాలనలో మొఘల్ రాజుల చేత ధ్వంసం కాబడిన ఆలయాలను పునరుద్ధరించి, సనాతన ధర్మం పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నా రన్నారు. భారత దేశ వీరుల చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చి భావి తరాలకు భారతీయుల ఔనత్యాన్ని తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాణి అహల్యాబాయ్ హోల్కర్ జీవితం ఆదర్శనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, వివిధ హోదాల బాధ్యులు డాక్టర్ రఘు, కన్నం అంజయ్య, నలువాల తిరుపతి, సాంబారి కళావతి, దురిశెట్టి మమత, కొక్కు గంగాధర్, సుంకేటి దశరథరెడ్డి, జుంబర్తి దివాకర్, రాగిల్ల సత్యనారాయణ, ఆముద రాజు, పిల్లి శ్రీనివాస్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు భారం..

(ఐదో పేజీ తరువాయి)

ధరలు పెరిగాయి. డీఏపీ రూ.1,300 నుంచి 1,450 వరకు పెరిగింది. అదే విధంగా 20-20-0-15 ఎరువు రూ.1,150 నుంచి రూ. 1,250కు, 28-28-0 ఎరువు రూ.1,275 నుంచి రూ.1,400కు, పొటాష్ రూ.850 నుంచి రూ.1,200కు పెరిగాయి. జనుము రూ.1,148 నుంచి రూ.2,500, జీలుగ రూ.1,116 నుంచి రూ.2,138 వరకు ధరలు పెరిగాయి.

గిట్టుబాటు కావడం లేదు

-నేముల రాజేశ్వర్‌రెడ్డి, రైతు, లక్ష్మీదేవిపల్లి



రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పండించిన పంట లకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో సాగు భారంగా మారుతోంది. కనీసం పెట్టుబడి అయినా చేతికందితే చాలన్న పరిస్థితిలో పంటలు సాగు చేస్తున్నాం. ప్రకృతి అనుకూలిస్తేనే పంట చేతికొచ్చే అవకాశం ఉంది. లేదంటే అప్పులే మిగులుతాయి.

ఖర్చులు పెరుగుతున్నాయి

-ఈర్ల శంకరయ్య, రైతు, బుగ్గారం



ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఖర్చులతో పెట్టుబడి భారంగా మారుతోంది. ప్రభుత్వమే ప్రోత్సాహం అందించాలి. రైతులకు సాగు భారం కాకుండా సర్కారు చర్యలు తీసుకోవాలి. ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ కూలీల ఖర్చు, ఇంధనం ధరలు పెరుగుతున్నాయి. దీంతో సాగు ఖర్చులు సైతం పెరుగుతున్నాయి.

రాష్ట్ర అవతరణ వేడుకలకు ఆహ్వానం

జగిత్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జూన్ 2వ తేదీన అధికారికంగా నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు, ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీకి చెందిన నలుగురి బృందాన్ని ప్రోటోకాల్‌తో ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ సెక్రెటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావు, గుగ్గిల్ల రవిగౌడ్‌లను జిల్లాలో జరిగే అధికారిక కార్యక్రమాలతో పాటు, జూన్ 2వ తేదీన జరిగే వేడుకలకు ఆహ్వానించాలని కలెక్టర్‌కు సూచిస్తూ తెలంగాణ ప్రభుత్వ కార్యదర్శి (జీఏడి పొలిటికల్) ఎం.రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీపై అధ్యయనం చేయడానికి రెండేళ్ల కాలపరిమితితో ఎన్నారై అడ్వయిజరీ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 10 తేదీన జీవో విడుదల చేసింది. ఈ కమిటీలో వైస్ చైర్మన్‌తో సహా నలుగురు జగిత్యాల జిల్లా వాసులకు చోటు దక్కడం విశేషం. సంబంధిత కమిటీ సభ్యులను రాష్ట్ర అవతరణ వేడుకలకు ఆహ్వానించాలని ఉత్తర్వులలో సూచించారు.

ఎంపీ కృషితో నవోదయ విద్యాలయం మంజూరు

-బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్‌రావు

కోరుట్ల రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కృషితో కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో నవోదయ విద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌రావు అన్నారు. శనివారం విలేకర్ల సమావేశంలో నవీన్‌రావు మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండు నవోదయ విద్యాలయాల మంజూరుకు కృషి చేసిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలపారు. విద్యాలయ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించి పనులు చేపట్టాలని ఆయన కోరారు. విద్యాలయ నిర్వహణకు ఎంపీ అర్వింద్ తన నిదుల నుండి రూ. 20 లక్షలు మంజూరి చేయ్యడంపై నవీన్ రావు హర్షం ప్రకటించారు.

రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం

-తొలగించిన పోలీసులు

కోరుట్ల రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలంలోని మాదాపూర్ రోడ్డులో శనివారం వేకువ జామున భారీ వృక్షం నేలకూలింది. దీంతో కోరుట్ల-రాయికల్ రహదారిలో వెళ్లే వాహనాలు భారీగా నిలిచిపోయాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికులు సహాయంతో రోడ్డుపై పడిన వృక్షాన్ని తొలగించారు. బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో కొమ్మలతో పాటు రోడ్డుపై పడిన గుంతలను పోలీసులు పూడ్చి వేయించారు. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో పోలీసులను పలువురు ప్రయాణికులు అభినందించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

సారంగాపూర్, మే, 31 (ఆంధ్రజ్యోతి) : యూఏఈ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. లచ్చక్కపేట గ్రామానికి చెందిన ఆకుల రమేష్ గౌడ్ అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందాడు, దీంతో ఆకుటుంబం స్థితిని చిరుపల్ల మహేష్ యూఏ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బొడ్డుపెల్లి రాము దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రాము తమ తోటి సభ్యులతో చర్చించారు. వెంటనే సభ్యులు రూ.10వేలతో మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు, అల్లోటి గంగాధర్, మల్లేష్, వేణు, శ్రీను, రాజేష్, రాము, రమేష్, గంగన్న, రంజిత్,గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

ధర్మపురి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీఆర్ ఈఈలు ఎండీ రహమాన్, లక్ష్మణ్‌రావు అన్నారు. ధర్మపురి పట్టణంలోని వాసవీ ఏసీ ఫంక్షన్ హాల్‌లో ధర్మపురి పీఆర్ ఏఈగా పని చేసి పదవీ విరమణ పొందిన సయ్యద్ ముకరం వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పీఆర్ ఈఈలు ఎండీ రహమాన్, లక్ష్మణ్‌రావు, డీఈఈలు గోపాల్, అశ్విన్, సత్యనారాయణ, రమణారెడ్డి, ఎంపీడీవో రవీందర్, ఎండపల్లి ఇంచార్జ్ ఎంపీడీవో నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి పరామర్శ

పెగడపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల తాజా మాజీ జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు తల్లి ప్రమీల అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం సాయంత్రం మృతి చెందగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆమె మృతి పట్ల సంతాపం తెలిపి, పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

ధర్మపురి, మే 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన గొడిశెల సత్తయ్య(44) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. సత్తయ్యకు రెండు సంవత్సరాల క్రితం యాక్సిడెంట్ జరిగి కాలు విరిగింది. దీంతో అప్పటి నుంచి మెదడులో రక్తం గడ్డకట్టి పక్షవాతానికి గురయ్యాడు. వ్యాధి నయం చేయుటకు చికిత్స నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు చెల్లించే స్థోమతలేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గొడిశెల మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం

● కొడిమ్యాల మండలంలో 2.36లక్షల మొక్కలు నాటడం లక్ష్యం


కొడిమ్యాల నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

కొడిమ్యాల, మే 31(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని 24గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పెంచుతున్న మొక్కలు 11వ వన మహోత్సవానికి సిద్ధమయ్యాయి. ఒక్కొక్క గ్రామ పంచాయతీకి 10వేల నుంచి 13వేల వరకు పండ్లు, నీడనిచ్చే, పూల మొక్కలను సంబంధిత అధికారులు పెంచుతున్నారు. పండ్ల మొక్కలలో అల్లనేరడి, జామ, చింత, బొప్పాయి. ఉసిరి, సీతాఫలం, దానిమ్మ తదితర, నీడనిచ్చె మొక్కలలో వేప, రావి, మేడి, కానుగ, తంగేడు, అల్లనేరడి తదితర, పూల మొక్కల్లో గులాబీ, మందార తదితర మొక్కలు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టుతున్న వన మహోత్సవానికి కొడిమ్యాల మండలంలో 2లక్షల 36 వేల మొక్కలను లక్ష్యంగా సిద్ధం చేసినట్లు ఎంపీడీవో స్వరూప తెలిపారు. వీటిలో నీడనిచ్చే లక్షా 39వేల మొక్కలు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. హోం షీడ్ మొక్కలు 97వేలు సిద్ధమయ్యాయి.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

-ఎంపీడీవో స్వరూప



కొడిమ్యాల మండలంలో వన మహోత్సవం విజయవంతం చేయటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. రైతులు పొలాల గట్లపై మొక్కలు నాటుకోవటానికి సిద్ధంగా ఉండాలి. ప్రభుత్వ భూములలో, వృధాగా ఉన్న భూములలో మొక్కలను నాటడానికి త్వరలో ఏర్పాటు చేస్తాం. ఇప్పటి వరకు అన్ని గ్రామ పంచాయతీ వన నర్సరీలలో మొక్కలను సిద్ధం చేశాం.

పని ఒత్తిడితోనే పంచాయతీ కార్యదర్శి మృతి

-జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల అగ్రికల్చర్, మే 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా ఇందన్‌పల్లిలో గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న జగిత్యాల పట్టణానికి చెందిన ఎర్రోజు చంద్రమౌళి పనిఒత్తిడితోనే గుండెపోటుతో మృతి చెందాడని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. పట్టణంలోని మృతుడి నివాసానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వసంత మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఏడాదిన్నర కాలం పూర్తవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో సెక్రటరీలు 24గంటలు కష్టపడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి రావల్సిన బడ్జెట్ రాకపోయినా గ్రామపంచాయితీల్లో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తుండడంతో స్వంతంగా డబ్బులు ఖర్చుచేసి బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గుండె పోటుతో మృతిచెందిన చంద్రమౌళికి ప్రభుత్వం నుంచి నాలుగు లక్షల రూపాయల బిల్లులు రావాల్సి ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారన్నారు. చంద్రమౌళి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, మే, 31 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలు కురుస్తున్నందున అంటూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఎలాల అంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బందికి సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలలో నీరు నిల్వ ఉండడంవలన దోమలు వ్యాప్తి చెంది మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు లాంటి వ్యాధులు ప్రబలించే ప్రమాదం ఉన్నందున పరిశుభ్రత తప్పకుండా పాటించాలన్నారు.

శుభ్రమైన కాచి వడపోసిన నీటనే తాగాలి. జ్వరం వచ్చినప్పుడు సొంత వైద్యం చేయకుండా వైద్యులను సంప్రదిం చాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండడం, మురుగు నీటితో దోమలు వ్యాప్తి చెందుతాయి. నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ అధికారులు సమన్వయంతో శుభ్రతపై ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎం, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారి

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం

రాయికల్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండంలలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాలలో మే 1 నుంచి 31 వరకు తెలంగాణ రాష్ట్ర క్రీడా, యువజన క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. 14 సంవత్సరాల విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణ నైపుణ్యాలు నేర్పుకున్నారు. ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు నాగరాజు, విక్రమ్, రాము పాల్గొన్నారు.

వెల్గటూర్‌లో..

●వెల్గటూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఉచిత వాలీబాల్ శిక్షణ కేంద్రం శనివారం ముగిసింది. శిక్షకుడు కాంపెల్లి సతీష్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి 7 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయస్సు గల 62 మంది బాల బాలికలు శిక్షణ శిబిరంలో నెల రోజుల పాటు శిక్షణ పొందారని తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది దొరిశెట్టి సురేష్, పెద్దూరి భరత్ కుమార్, నక్క సురేష్, విష్ణుభక్తుల వెంకటేష్, బొమ్మకంటి కమలాకర్, గాజుల శ్రీనివాస్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు మూగల సంతోష్, ఆకుల సుమన్, లకుమల్ల సాయి, కొండ సాయినాథ్, మ్యాకల వికాస్, అరవింద్, గుమ్ముల రాహుల్, మోతే సాయి పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

●గొల్లపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి వాలీబాల్ ఉచిత క్రీడా శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా యువజన, క్రీడా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా శిక్షణ శిబిరానికి బాలబాలికల నుంచి అనూహ్య స్పందన లభించింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 62 మంది 7 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సున్న బాలబాలికలు పాల్గొన్నారు.